క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో సోమవారం మదనపల్లిలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించే వైద్య శిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శివన్న కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆదివారం మదనపల్లె పట్టణంలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సీసీ కెమరాలు, నిఘా నీడలో పరీక్షలు జరిగాయి. పట్టణంలో 8 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మొదటి బ్యాచ్‌లో 162 మంది విద్యార్థులు హాజరైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. పరీక్షలు 20వతేదీ వరకు జరుగుతాయన్నారు. ఉదయం మొదటి బ్యాచ్, మధ్యాహ్నం రెండో బ్యాచ్‌లకు పరీక్షలు నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి: మండల కేంద్రంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. కలికిరి–1 సచివాలయం పరిధిలోని ఆర్.ఎస్. రోడ్డు, కోటవీధి, పాతసంతగేటు వీధి, టీ.బీ. రోడ్డు ఏరియాలో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటించి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమానికి అధికారులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీజేపీ మండలాధ్యక్షులు వీరే

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలకు బీజేపీ కొత్త అధ్యక్షులను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. బి.కొత్తకోట అధ్యక్షుడిగా రాందాసు, తంబళ్లపల్లెకు భాస్కర్‌రెడ్డి, పెద్దమండ్యంకు లక్ష్మీనారాయణ, కురబలకోటకు రజాక్, ములకలచెరువుకు పీవీ.జయరామిరెడ్డి, పెద్దతిప్పసముద్రంకు కార్యం శంకర్ నియమితులయ్యారు.

పట్టణ అధ్యక్షుడిగా బర్నేపల్లె రవికుమార్

మదనపల్లె : పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా బర్నేపల్లె రవికుమార్‌ను నియమిస్తూ రాజంపేట బీజేపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ ఉత్తర్వులు జారీచేశారు. పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా బర్నేపల్లె రవికుమార్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి పార్టీ పట్టణ అధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రామసముద్రం: మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా కమ్మవారిపల్లికి చెందిన ఇంజమ్ ఆనంద్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదనంకుమార్ ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలికిరి: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా మండలంలోని మహల్‌కు చెందిన న్యాయవాది మూర్తయ్యను నియమిస్తూ ఆ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలో బీజేపీ అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తానని, తనని యామకానికి సహకరించిన బీజేపీ జిల్లా నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన నియామకం


సికిందర్ బాషా

పెద్దతిప్పసముద్రం: వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఫొటోగ్రాఫర్ సికిందర్ బాషాను నియమించినట్లు ఎంపీపీ మహమూద్ ఆదివారం పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సికిందర్ పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారామనాయుడు మాట్లాడుతూ 220 మందికి పరీక్షలు నిర్వహించి 60 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉచిత అద్దాలకు 40 మందిని, ఉచిత ఆపరేషన్లకు 64 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ, అరవింద్ నేత్రాయల సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ దిశగా సింగిల్‌విండోలు

- ఈనెల 14లోపు ఖాతాదారులు వివరాలు సమర్పించాలి
- సింగిల్‌విండో ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఏజీఎం చంద్రకళ


మాట్లాడుతున్న ఛైర్మన్ దండుకృష్ణారెడ్డి, ఏజీఎం చంద్రకళ తదితరులు

మదనపల్లె : కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చేపట్టిన సహకార సంఘాల సంస్కరణల్లో భాగంగా మదనపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ (సింగిల్‌విండో)ను కంప్యూటరీకరణ, డిజిటలైజేషన్ చేయడం జరుగుతోందని ఛైర్మన్ దండుకృష్ణారెడ్డి, ఏజీఎం చంద్రకళ తెలిపారు. ఆదివారం సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ...కంప్యూటరీకరణ, డిజిటలైజేషన్‌కు సంబంధించి సింగిల్‌విండో సభ్యులు, ఖాతాదారులు, రుణగ్రహీతల వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదుచేయడం జరుగుతోందన్నారు. దీనికి సంబంధించి ఈనెల 14లోపు సింగిల్‌విండోలోని సభ్యులు, ఖాతాదారులు, రుణాలు పొందినవారు, డిపాజిట్‌దారులు తమకు సంబంధించిన ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు, భూమిపాసుపుస్తకం నకలు సింగిల్‌విండో కార్యాలయంలో అందజేయాలన్నారు. మదనపల్లె సింగిల్‌విండోలో 6,500 మంది సభ్యత్వం కలిగి ఉన్నారని, 825 మంది వివిధ రకాల రుణాలు పొందాలన్నారు. 2023–24 ఆర్థికసంవత్సరానికి సంబంధించి రూ.3.06 కోట్ల గోల్డ్‌లోన్స్, 28లక్షల దీర్ఘకాలిక రుణాలు, రూ.5కోట్ల పంటరుణాలు పంపిణీ చేశామన్నారు. సింగిల్‌విండోలో ఖాతాలేని వారికి బంగారుపై రుణాలు తక్షణమే మంజూరుచేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ కరుణాకర్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంక్ సూపర్‌వైజర్ పుష్పలత, ఆడిటర్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవానికి ఆహ్వానం


ఉరుసుకు ఉత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానిస్తున్న మైనార్టీ నాయకులు

వాల్మీకిపురం: స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలను దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎండీసీ డైరెక్టర్‌లను కలసి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలవతో సన్మానించారు. ఈ నెల 23వ తేది నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉరుసు ఉత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఫూ మొహియుద్దీన్, కమిటీ అధ్యక్షుడు సందాని బాషా, సభ్యులు షాహిద్, చికెన్ మస్తాన్, సాధిక్, బబ్లూ, సైపుల్లా, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎస్.మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్‌కు రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరురోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని రైల్వేమంత్రికి వినతిపత్రాలు పంపించామన్నారు. మార్చి 10న దృష్టి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై ఆవుల షెడ్ ఏర్పాటు


గోపూజా కార్యక్రమంలో దాతలు

తంబళ్లపల్లె: మండలంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామికి దాతలు గోదానం చేశారు. ములకలచెరువు మండలం దేవులపల్లె పంచాయతీ మామిడిగుంపువారిపల్లె చినపరెడ్డి,లక్ష్మీదేవమ్మ దంపతుల కుమారుడు ఎన్ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, సుజాతమ్మలు సుమారు రూ.4 లక్షల ఖర్చుతో ఆవులకు షెడ్ నిర్మాణం చేశారు. ఆదివారం దాతల కుటుంబీకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. పూజారి ఈశ్వరప్ప ఆవుల షెడ్డులో పూజలు నిర్వహించి ప్రారంభించారు. వారి దాతృత్వాన్ని మల్లయ్యకొండ ఛైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని రాష్ట్రసరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, కడపకు చెందిన మార్కండేయ కుమారుడు రాఘవేంద్ర ప్రసన్నకుమార్(35) ఆటోలో కర్నాటకకు చెందిన 6 రెడ్‌వైన్ బాటిల్స్ తరలిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి రూ.2,065 విలువ కలిగిన రెడ్‌వైన్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

500 లీటర్ల సారాఊట ధ్వంసం..

మండలంలోని సీటీఎం పంచాయతీ ఊటగుట్టలోని సారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 500 లీటర్ల సారా ఊటను గుర్తించి, ధ్వంసం చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న 8లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోలీసుల రాకను గమనించి పరారైన గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని నక్కలదిన్నెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో స్థానికంగా సారా తయారుచేసి విక్రయిస్తున్న కే.వెంకటరమణనాయక్(55)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

తవళం దళిత వాడలో..

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తవళం హరిజనవాడలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన ఇడగొట్టిరమణ(47) సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

రాయచోటి టౌన్ : బీసీలు రాజకీయంగా ఎదిగేలా మనందరం కలసికట్టుగా పని చేయాలని అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దువ్వూరు నరసింహాచారి కోరారు. సోమవారం రాయచోటి పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో బీసీల చైతన్య వేదిక టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా బీసీలు వెనకబడి ఉన్నారని, రాజకీయంగా ఎదిగినప్పుడే మనం అన్ని రంగాల్లో ఎదుగుతామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే బీసీలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అలానే వారి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. నరసింహాచారిని ఘనంగా సన్మానించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరావు, వర్కింగ్ ప్రసిడెంట్ గోవింద్ సుధాకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులుగా పాలగిరి హబీబుల్లా, ఉపాధ్యక్షులు రమేష్, పురుషోత్తం, నాగేశ్వర, గౌరవ అధ్యక్షులు శివప్రసాద్ నాయుడు (గుట్టబాబు), సుబ్బరాజు యాదవ్‌లతోపాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సోమారపు నాగార్జున ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగులమ్మ

వాల్మీకిపురం: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ గంగులమ్మ అన్నారు. ఆదివారం వాల్మీకిపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం 1, సచివాలయం 4 (ఓబులంపల్లి) నూతన భవనాలను ఆమె ప్రారంభించారు. అలాగే పివిసి ప్రభుత్వ పాఠశాల, ఫత్తేపురం, నాగంవారిపల్లి, దండువారిపల్లిలో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్‌వోఆర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి చేరేలా 548 సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రాల్లోని కార్యాలయాలకు వచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఛైర్మన్ నీళ్లభాస్కర్, సింగల్ విండో అధ్యక్షులు శ్రీధర్‌రాయల్, రాజేష్, రఘు, మదనమోహన్ రెడ్డి, శ్యామ్, మహేష్, చలపతి, కుమార్, శ్రీరాములు, శివ, నాగరాజ, రమణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై వేంకటరమణుడి ఊరేగింపు


శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మూడు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉప ప్రధాన అర్చకులు క్రిష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబులు శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామిని ప్రత్యేక అలంకరణ చేశారు. శేష వాహనంపై స్వామివారిని ఉరేగించి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి హంస వాహనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఇన్‌పెక్టర్ డిశంత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కురబలకోట: కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో 1988–89లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్న వీరు కొందరు ఉద్యోగాలు మరికొందరు వ్యాపారాలు ఇంకొందరు ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. పాఠశాల మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. గురువులను సత్కరించారు.

చీకలగుట్టలో కార్డెన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న సారా, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ యువరాజు

మదనపల్లె : పట్టణంలోని చీకలగుట్టలో ఆదివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ కేశప్ప ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టామన్నారు. అందులో భాగంగా గౌతమీనగర్‌లో ఓ ఇంటిని సోదాచేయగా, 30 లీటర్ల నాటుసారా దొరికిందన్నారు. దీంతో సారావిక్రేత హనుమంతునాయక్ (47)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ

రామసముద్రం: మండల ప్రాంతంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులలో ఆదివారం ఎక్సైజ్ ఎస్ఐ రమణ, ఏఎస్ఐ హిమచలపతి ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా జిల్లా అధికారులు ఆదేశాల మేరకు కర్ణాటక నుంచి అక్రమంగా వస్తున్న మద్యం, నగదు, వివిధ రకాల వస్తువులపై తనిఖీ నిర్వహించారు. వాహనాలో ఎలాంటి అక్రమమైన సరుకు దిగుమతి కాకుండ గుట్టపాళ్యెం, ఏ.కొత్తూరు, ఆల్పేపల్లి , పురాండ్లపల్లి చెక్‌పోస్టులలో నిఘా ఉంచినట్లు చెప్పారు. వాహనాల రికార్డులు సరుకు సంబంధించి పత్రాలు లేకుంటే స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


హోమాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య మహిళలు కలశాలతో గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం వద్దకు చేరుకున్నారు. గంగాజలంతో అమ్మవారిని అభిషేకం చేశారు. ఆలయ ఆవరణంలో పూర్ణహతి, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ...చల్లంగా చూడమ్మా


సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడు అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. భక్తులు అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు తలనీలాల సేకరణకు వేలం

రెడ్డెమ్మతల్లి ఆలయంలో తలనీలాల సేకరణకు ఈనెల 13న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల తెలిపారు. ఆదివారం స్థానిక ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2024 మార్చి 31 నుంచి 2025 మార్చి 31 వరకు భక్తులు అమ్మవారికి సమర్పించే తలాలనీ సేకరణ హక్కు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొన దలచిన వారు రూ. 5 లక్షలు ధరావత్తు చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దేవదాయశాఖ నిబంధనల మేరకే వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రామాపురం : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ గడికోట విజయలక్ష్మి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి సుమారు 180 మందికి పైగా రోగులు వైద్య సేవలను పొందారు. శస్త్రచికిత్సలకు 15 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలను అందిస్తామని వైద్యులు ఆంజనేయులు తెలిపారు. రోగులకు ఛార్జీలు, భోజనాలు, మందులు ఇస్తామని పేర్కొన్నారు. శిబిరంలో సింగల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, వైద్యులు వినయ్, సిబ్బంది యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్న పాలకులు'

రాయచోటి అర్బన్ : ప్రశ్నించే వారిని, పోరాడే వారి గొంతుకలను నొక్కడమే ధ్యేయంగా పాలకులు పని చేస్తున్నారని పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త క్రాంతిచైతన్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో ఏపీసీఎల్‌సీ 11వ జిల్లా మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అమాయక ప్రజలపై పాలకుల జరుపుతున్న హింసను ప్రశ్నించేందుకే 1973 డిసెంబర్ 23న గుంటూరులో మహాకవి శ్రీశ్రీ అధ్యక్షతన పౌరహక్కుల సంఘం ఏర్పడిందన్నారు. ఎవరికి భయపడకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సంస్థ 50 వసంతాల కాలంలో ఎంతోమంది ఉద్యమనేతలకు పోగొట్టుకుందన్నారు. ఏపీసీఎల్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ చట్టం ఉన్నది కేవలం, భూస్వాములు, పెట్టుబడిదారులు, పాలకులకు మాత్రమే కానీ పేదలకు ఏమాత్రం కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడం దారుణమన్నారు. ప్రజలకు మద్దతుగా నిలబడి మాట్లాడుతున్న మేధావులు, రచయితలు, హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులపై పాలకులు ఎన్ఐఏను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయించి జైళ్లలో మగ్గేటట్లు చేస్తున్నారన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సమస్యలను ఎత్తిచూపుతూ ప్రశ్నించే వారిపై పాలకులు దాడులకు పాల్పడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నాయంటూ మండిపడ్డారు. అనంతరం ఏపీసీఎల్‌సీ నేతలు మనోహర్‌రెడ్డి, రాయచోటి రవిశంకర్, సురేష్, రవిశంకర్, రెడ్డెయ్య, పుల్లయ్య, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ, యూన్సీలక్ష్మి, డీహెచ్‌పీఎస్ నేత సుదీర్, సీపీఐ విశ్వనాథనాయక్, బాస్ నేత పల్లం తాతయ్యతోపాటు పలు సంఘాల నేతలు, పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

ఏపీసీఎల్‌సీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడుగా పి.రెడ్డెయ్య, కోశాధికారిగా మనోహర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం.రవిశంకర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.